క్లుప్తంగా

నేడు సాతులూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

నాదెండ్ల: సాతులూరు ఈతరం పబ్లిక్ స్కూలులో ఆదివారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కాకాని శంకర కంటి వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. వైద్య శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, ఆరోగ్య శ్రీ కార్డు, ఫోన్ నెంబరుతో హాజరుకావాలన్నారు. కంటి పరీక్షలు నిర్వహించి లోపాలున్న వారికి శుక్లాల ఆపరేషన్ కోసం స్వంత బస్సుల్లో పెదకాకానికి తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

3న అంగలూరు చేపల చెరువు వేలంపాట

ఈపూరు (వినుకొండ): ఈపూరు మండలం అంగలూరు గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న వంటి ఊరచెరువు చేపల చెరువును బహిరంగ వేలంపాట ఈనెల 3వ తేదీన ఉదయం 11 గంటలకు అంగలూరు గ్రామంలో ఉన్న గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ముంద్రు మనోహర్ శనివారం తెలిపారు. బహిరంగ వేలంపాటలో పాల్గొనే వారందరూ ధరావత్తు రూ. 84 వేలు చెల్లించాలన్నారు. పంచాయతీ అధికారులు గ్రామపెద్దలు సమక్షంలో వేలంపాట నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వేలంపాట జరుగుతుందన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

శావల్యాపురం: కార్తికమాసం సందర్భంగా మండలంలోని కారుమంచి గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగా భ్రమరాంబా సమేత శ్రీ చెన్న కేశవస్వామి దేవాలయంలో శాంతి కల్యాణ వేడుకలు దంపతులచే శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదండితులు పవన్‌కుమార్ తన బృందం సారథ్యంలో వేద మంత్రాలు మేళతాళాలతో కల్యాణ వేడుకలు స్వామివారికి విశేష పూజలు వైభవంగా నిర్వహించారు. అనంతరం 2 వేల మందికి అన్నసంతర్పణ కార్యక్రమం కమిటీ సభ్యులు గ్రామస్తులు దాతలు సౌజన్యంతో విజయవంతంగా చేపట్టారు. ఆలయ పూజారి స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు



బొల్లాపల్లి : మండలంలోని రెడ్డిపాలెం గ్రామంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి వారి ఉత్సవాలు నేటి నుంచి మూడు రోజుల పాటు జరుగుతాయని రెవ.ఫాదర్ వై.జాకబ్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాలకు చర్చి అలంకరణ చేసినట్లు తెలిపారు. తొలిరోజు దివ్యపూజాబలితో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 1506లో స్పెయిన్ దేశంలో జన్మించిన పునీత ఫ్రాన్సిస్ శౌరి వారు క్రీస్తు అనుచరుడిగా, మత బోధకుడిగా భారత దేశంలోని పలు ప్రదేశాల్లో క్రీస్తు బోధనలు గావించారని, ఆయన జ్ఞాపకార్థం రెడ్డిపాలెం గ్రామంలో 1912లో అప్పట్లో బ్రిటీష్ వారి హయాంలో చర్చి నిర్మించారన్నారు. చర్చి ఆవరణలోని చెట్టు తొర్రలో మరియమ్మ విగ్రహం ప్రత్యేక ఆకర్షణ. గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. నేటి నుంచి మూడు రోజుల పాటు పలు రకాల కార్యక్రమాలు ఉంటాయని, రాష్ట్రస్థాయి వాలీ బాల్ పోటీలు, డ్యాన్స్‌బేబి డ్యాన్స్ పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. గ్రామ సర్పంచ్ కె.ప్రభాకరరావు, గ్రామపెద్దలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కవి గురజాడ అప్పారావు వర్ధంతి



వినుకొండ(నూజెండ్ల): ప్రముఖ కవి, సంఘసంస్కర్త గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు వైతాళికుడు గురజాడ అని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేసనపల్లికి ఘన సన్మానం



వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ కేసనపల్లి సుబ్బారావుకు ఘనసత్కారం లభించింది. సుబ్బారావు తీసిన చిత్రాలకు అంతర్జాతీయ స్థాయిలో లభించిన ఎఫ్ఐసీఏస్ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, ఫోటో గ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన వేడుకల్లో ఈ సన్మానం జరిగింది.

నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులు

- డీవార్మింగ్‌తో దూడలకు శ్రీరామ రక్ష
- యాజమాన్య పద్ధతులు ఎంతో మేలు

రొంపిచర్ల: లేగ దూడల పెంపకంలో పశుపోషకులు శాస్త్రీయ అవగాహనతో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే నేటి లేగ దూడలే రేపటి పాడి పశువులుగా తీర్చిదిద్దవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుత తరుణంలో లేగ దూడలలో మరణాల రేటు 20 శాతంగా ఉంది. ఈ మరణాల శాతాన్ని తగ్గించాలంటే పశువు చూడి దశ నుంచి దూడకు సంవత్సరం వయస్సు వచ్చే వరకు కనీస జాగ్రత్తలు, దాణా అందిస్తే ఆరోగ్యవంతమైన పాడి పశువులు తయారు అవుతాయి. పశువుల్లో ఆరోగ్యకరమైన దూడలు పుట్టేందుకు ఆరు మాసాల చూడి దశనుండి ఈనే వరకు 2 కేజీల దాణ అదనంగా అందించాలి. ఆరు నెలల చూడి దశలో డీవార్మింగ్ చేయాలి. చివరి మూడు నెలలో గర్భంలో దూడ పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. బరువైన, ఆరోగ్యమైన దూడ జన్మించాలంటే పోషకాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని ఎక్కువగా ఇవ్వాలి. చూడి పశువును ఉంచే షెడ్‌లలో నేల పొడిగా, శుభ్రంగా ఉండేలా చూసుకోవాలి. దూడ పుట్టిన వెంటనే దూడ ముక్కు, నోటిలో ఉన్న జిగురు పదార్థాలను తుడిచివేయాలి. సాధారణంగా దూడ పుట్టిన వెంటనే ఆవు కాని, గేదె కాని దూడను నాకుతూ ఉంటుంది. ఈ చర్య వల్ల దూడకి, తల్లికి అవినవబావ సంబందం ఏర్పడి దూడలో శ్వాస, రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. ఆవు పొదుగును శుభ్రమైన నీటితో కడిగి ఆరిన తర్వాత దూడకు జున్నుపాలను తాపాలి. సాధారణ పాలల్లో కంటే జున్ను పాలల్లో అధిక రెట్లు పోషక విలువలు ఉంటాయి.

జున్నుపాలతో ఎంతో మేలు

దూడలో వ్యాధి నిరోధక శక్తిని పెంచే యాంటీ బాడీలు ఎక్కువ మొత్తంలో వనకూరతాయి. కనీసం రోజుకు మూడు లీటర్ల జున్ను పాలు తాగించే ఏర్పాట్లు చేయాలి. జున్ను పాలు అంతకు మించి తాగితే తెల్లగా పారుతుంది. పశువు దూడను ఈని మరణించినప్పుడు స్వయంగా పాలు తాగలేని



తల్లి వద్ద పాలు తాగుతున్న ఆవుదూడ



ఈనిన వెంటనే దూడలను నాకుతున్న గేదె

దూడకు జున్ను పాలు లభ్యంకాని పరిస్థితుల్లో కృత్రిమ జున్నుపాలు పట్టించాలి. అరలీటరు వేడి పాలలో పావు లీటరు గోరు వెచ్చని నీరు, రెండు కోడిగుడ్లు కలిపి 15 మిల్లీలీటర్ల శనగనూనె, 2 మిల్లీలీటర్ల ఆముదం కలిపి కృత్రిమ జున్నుపాలను తయారు చేసుకోవచ్చు. అలా తయారు చేసిన జున్ను పాలను మూడు రోజుల పాటు అందిస్తే దూడ ఆరోగ్యంగా ఉంటుంది. దూడల్లో బరువు కోల్పోవడం, కళ్ల నుంచి నీరు కారుడం హిమోగ్లోబిన్, రక్తహీనత, జిడ్డుగా, నీళ్లుగా, దుర్వాసనతో కూడిన పేడ, జుట్టు రాలటం, గరుకు చర్మం, వంటిపై గోమార్లు, పేలు లాంటి లక్షణాలు కన్పిస్తే దూడ కడుపులోని పేగుల్లో నులి పురుగులు ఉన్నాయని గమనించాలి. నులి పురుగుల నివారణకు దూడ పుట్టిన ఏడవ రోజు, 21వ రోజున డాక్టర్ సలహా మేరకు పైపెరజైన్ తగు మోతాదులో వేయాలి. ప్రతినెలా ఈ మందును 6 నెలల వరకు ఇవ్వాలి. 6 నుంచి 12 నెలల వరకు రెండు నెలలకోసారి తాపించి దూడలను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చని పశువైద్యులు వెల్లడించారు.

డీవార్మింగ్‌తో మరణాల రేటు తగ్గించవచ్చు



దూడల ఆరోగ్యంపై పశుపోషకులు కనీస జాగ్రత్తలు వహిస్తే ఆరోగ్యవంతమైన పాడిపశువులు తయారవుతాయి. గేదె 6 నెలల చూడిలో ఉన్నప్పుడే డీవార్మింగ్ చేయాలి. అలా దూడ పుట్టినప్పటి నుంచి సంవత్సరం లోపు కనీసం 8 నుంచి 9 సార్లు డీవార్మింగ్ మందు తాపితే దూడల్లో మరణాల రేటు తగ్గుతుంది. ఆరోగ్యవంతమైన పశు సంపదను తయారు చేసుకోవచ్చు.

– డాక్టర్ సాయి మహేష్ రెడ్డి, పశువైద్యులు

మళ్లీ టమోత!



మార్కెట్‌లో దిగుమతి అయిన టమాటాలు

- కిలో రూ.60 పై మాటే!
- గత వారం రూ.40

యడ్లపాడు: తగ్గినట్టే కనిపించిన టమాటా ధరకు మళ్లీ రెక్కలొచ్చాయి. శుక్రవారం దీని ధర కిలో రూ.60కి పలికింది. గతవారం కేజీ ధర రూ.40లోపే ఉండగా, వారంలోనే భారీ పెరుగుదల కనిపించింది. ఇతర ప్రాంతాల్లో సరుకు లేకపోవడం, రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో తుఫాను రావడం వెరసి టమాటా ధరకు డిమాండ్ పెరిగినట్లు వ్యాపారులు వెల్లడించారు. అదే విధంగా ఉల్లిపాయలు రూ.50, బీన్స్‌పిక్కలు రూ.120, చిక్కుడు రూ.100లకు చేరాయి. బెండకాయలు రూ.60, వంకాయలు రూ.50, దొండకాయలు రూ.40 ఉన్నాయి. కార్తికమాసం ఆదివారంతో ముగుస్తుండటంతో వచ్చేవారానికి వీటి ధరలు స్వల్పంగా తగ్గే అవకాశం ఉందని వ్యాపారులు పేర్కొన్నారు

బోధనపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలి

- విద్యాప్రమాణాలను పెంచాలి
- లెర్నింగ్ ఔట్ కమ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలి

బొల్లాపల్లి : విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను పెంచాలని పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. చంద్రకళ అన్నారు. మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి జెడ్పీ హైస్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను శనివారం డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో మమేకమై అభ్యాసన సామర్థ్యాలు పరీక్షించారు. 6,7 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఈ మేరకు డీఈవో పలు సూచనలు చేశారు. బోధనపై దృష్టి సారించాలని, అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించాలని సూచించారు. లెర్నింగ్ ఔట్‌కమ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని ఈ సందర్భంగా తెలుగు, లెక్కలు, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో విద్యార్థులను తీర్చిదిద్దాలని, పునాది పటిష్టంగా ఏర్పాటు చేయాలన్నారు. చదవడం, రాయడంలో విద్యార్థులను పూర్తిస్థాయిలో తర్ఫీదు ఇవ్వాలని డీఈవో సూచించారు.



బొల్లాపల్లి హైస్కూల్లో విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో

ఈ–క్రాప్ నమోదు తప్పనిసరి

- జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిరాల మురళి
- జిల్లాలో 115 వరి పంట కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభం
- ఆశాజనకంగా వరి పంట

శావల్యాపురం: పంటలు సాగు చేసిన రైతులందరు ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఇంగిరాల మురళీ అన్నారు. శనివారం శావల్యాపురంలో ఖరీఫ్ సీజనులో సాగు చేసిన కోత దశలో ఉన్న వరి పొలాలను పరిశీలించి రైతులకు ఈ–క్రాప్ నమోదు గురించి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మురళీ మాట్లాడుతూ జిల్లాలో ఖరీఫ్ సీజనులో వరి పంటను 35 వేల హెక్టార్లు అన్నదాతలు సాగు చేసినట్లు తెలిపారు. రబీలో కూడ 25 వేల హెక్టార్లు మొర వరి పంట సాగుకు రైతులు సిద్ధం అవుతున్నారన్నారు. ప్రస్తుతం వరి పంట ఆశాజనకంగా ఉందని తెగుళ్లు నియంత్రణ చేయటంతో పాటు వాతావరణం అనుకూలత వలన ఒక్కో ఎకరానికి 32 నుంచి 40 బస్తాలు దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి మురళీ తెలిపారు. రైతులనుద్దేశించి మాట్లాడుతూ పంట సాగు చేసిన రైతులందరూ ఈ–క్రాప్ నమోదు చేయించటం ద్వారా ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రభుత్వ పరంగా పరిహారం అందించటంతో పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా వరి పంట కొనుగోలు కేంద్రాలను వచ్చే వారంలో 115 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వరి సాధారణ రకం మద్దతూ 75 కేజీల బస్తా రూ. 1720లు, ఏగ్రేడ్ రకం రూ.1740 ధర ప్రభుత్వం ప్రకటించినట్లు తెలిపారు. ధాన్యం అమ్ముకునే రైతులు రైతుసేవా కేంద్రాల్లో తమ పేర్లు ముందుస్తుగా నమోదు చేసుకుంటే కొనుగోలు కేంద్రాల్లో మొదట ప్రాధాన్యత ఇస్తామన్నారు. దళారులు నుంచి రైతులు మోసపోకుండా ఉండటానికి కొనుగోలు కేంద్రాలు ఎంతోగానో దోహదపడతాయన్నారు. వరి నాణ్యత ప్రమాణాలు 17 శాతం ఉండాలని, అపరిపక్వత గింజలు 5 శాతం, మొలకెత్తిన విత్తనాలు 3 శాతం వరకు ఉండేలా రైతులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు. వరి పంట అమ్ముకునే రైతులకు గోనెసంచులు, రవాణా చార్జీలను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు, వీఏఏ వెంకయమ్మ, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మురళీ

చట్టసభల్లో సీట్లు కేటాయించాలి

నరసరావుపేట: రాష్ట్రంలోని వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చి వారికి రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వాలని వడ్డెర సంఘ నియోజకవర్గ అధ్యక్షులు బత్తుల వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం పల్నాడు రోడ్డులోని నియోజకవర్గ వడ్డెర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 78ఏళ్లు గడుస్తున్నా రాష్ట్రంలో 35 లక్షలకుపైగా జనాభా ఉన్న వడ్డెర్లకు మాత్రం ప్రభుత్వపరంగా లభించింది శూన్యమే అన్నారు. రాజకీయంగా నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని, చట్టసభలైన రాజ్యసభలో ఒక సీటు, రెండు ఎమ్మెల్సీలు, కేటాయించాలని కోరారు.

సేవకు ప్రతి రూపం రోటరీ



చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం రోటరీ సంస్థ అని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు ఆళ్ల వేమనరెడ్డి చెప్పారు. రోటరీ హాలులో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు వైద్య సహాయం అందించేందుకు రోటరీ క్లబ్ క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నదని తెలిపారు. కాపు వెంకటరావు రోటరీ ఉచిత ఆరోగ్య కేంద్రానికి అవసరమైన మందులు కొనుగోలు చేసేందుకు రూ. 25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఉప్పుటూరి ప్రసాద్, తోటకూర వెంకటనారాయణ, తియ్యగూర యశ్వంత్ రెడ్డి, గల్లా సాంబశివరావు, డాక్టర్ కందుల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

పించన్ల పంపిణీ

నరసరావుపేట రూరల్: ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లు మండలంలో శనివారం 95 శాతం పంపిణీ చేశారు. మండలంలో 12438 పింఛన్లు ఉండగా 11737 పెన్షన్‌లను అందజేశారు. గ్రామ సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీలో పాల్గొన్నారు. పెట్లూరివారి పాలెంలో జరిగిన పింఛన్ పంపిణీని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ పరిశీలించారు.

సత్తాచూపిన శావల్యాపురం బాలికలు

శావల్యాపురం: విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ అండర్–17 బాలికల విభాగంలో గుంటూరు జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించినట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల జట్టు కోచ్ రాగుల రాధాకృష్ణమూర్తి శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా శావల్యాపురం గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికలు జట్టులో ఐదు మంది ఉండగా ఆకుమళ్ళ సమీరా, కామినేడి కావ్య, వేముల దివ్య, బండారు దేవమణి, ఓర్సు స్రవంతి ఐదు మంది శావల్యాపురం హైస్కూల్లో ఇంటర్ చదువుతున్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో పోటీల్లో వరసగా రెండవ సారి విన్నర్స్‌గా నిలిచారు. ప్రథమ స్థానం సాధించిన జట్టుకు జిల్లా విద్యాశాఖాధికారి చేతుల మీదగా కప్‌ను అందుకున్నారు. ప్రథమస్థాన సాధించిన బాలికల జట్టును విద్యాకమిటీ చైర్మన్ పాటిబండ్ల శ్రావన్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు, పాఠశాల పీడీ ఉమ్మడి గుంటూరు జిల్లా కోచ్ రాగుల రాధాకృష్ణమూర్తిలు ప్రత్యేకంగా అభినందించారు.



ప్రథమస్థానం సాధించిన జట్టుకు కప్‌ను అందజేస్తున్న విద్యాశాఖాధికారి

వినుకొండలో లక్ష దీపార్చన



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్ శ్రీ సమర్థ సద్గురు షిరిడీ సాయిబాబా మందిరంలో కార్తీక మాసం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవున శివలింగమును మహిళ భక్తులచే 6 వేల ప్రమిదలతో ఒక్కొక్క ప్రమిదకు పదివేల ఒత్తుల కట్టతో ఆరు కోట్ల ఒత్తులతో దీపాలు వెలిగించారు. అర్చకులు శ్రీనివాసులు శాస్త్రి పాల్గొన్నారు.

వణికిస్తున్న ఫెయిం'జల్లు'లు



పాలుపోసుకుంటున్న వరి కంకులు



కోతకు సిద్ధమవుతున్న వరిపైరు



పొట్ట దశలో ఉన్న వరిపైరు

మండలంలో శనివారం వర్షాలు ప్రారంభమయ్యాయి. ఫెయింజల్ తుఫాన్ ప్రభావంతో గత నాలుగు రోజులుగా ఆకాశం మేఘావృతమై చల్లటి వాతావరణం నెలకొంది. గాలిలో తేమ శాతం పెరిగింది. దీంతో మాగాణి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కొంత విస్తీర్ణంలో వరిపంట కోతకు సిద్ధమవుతుండగా, మరి కొంత విస్తీర్ణంలో వరి కంకులు పాలు పోసుకుంటున్నాయి. ఈ పరిస్థితులో ఈ వాతావరణం ఇలాగే కొనసాగితే వరికి మానుపండు తెగులు వస్తుందని ఆందోళన చెందుతున్నారు. దీని నివారణకు రైతాంగం ముందు జాగ్రత్త చర్యగా కార్బెండిజమ్, మాంకోజెబ్ మందులు ఒక ఎకరానికి 300 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి వరిపైరుపై పిచికారీ చేయాలని స్థానికంగా రైతు సేవా కేంద్రాల్లో ఉన్న వీఏఏలు రైతులకు సూచిస్తున్నారు. –రొంపిచర్ల

హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీ

వినుకొండ(నూజెండ్ల): ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ రజాక్ ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల్లో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌రింటెండెంట్ సిబ్బంది, కౌన్సిలర్ కె.సురేష్, ల్యాబ్ టెక్నీషియన్ రోజా, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ సిబ్బంది, వి. ఏడుకొండలు, ఆశ, సీఎల్ డబ్ల్యూ శైలజా, వైర్‌జేకే సిబ్బంది అనూష, వి.సీహెచ్.సి. సిబ్బంది, అనురాధ, శ్వేత, వీహెచ్ఎస్ హనుమంతునాయక్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్ రంగోలీ పోటీలు

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో శనివారం పిఎన్‌సీ అండ్ కెఆర్ కళాశాలలో రంగోలి (ముగ్గులు) పోటీ నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ, నా ఆరోగ్యం నా హక్కు నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. హెచ్ఐవీ బాధితులు పౌష్టికాహారం, క్రమశిక్షణతో కూడిన ఆహారపు అలవాట్లు, వ్యాయామం ద్వారా జీవిత కాలాన్ని పెంచవచ్చని వివరించారు.

డ్రైయినేజీ సమస్యను పరిష్కరించండి

మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు



అధ్యక్షత వహించిన షేక్ రఫాని



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు

చిలకలూరిపేట: పురపాలక సంఘంలో విలీన గ్రామమైన గణపవరం డ్రెయినేజీ సమస్య పరిష్కరించి, ఆక్రమణలు తొలగించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు కోరారు. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో శనివారం నిర్వహించారు. సమావేశానికి మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని అధ్యక్షత వహించారు. ఎజెండాలో అంశాలు చదవడం పూర్తి అయ్యాక వైస్ చైర్మన్ డ్రైనేజీ విషయాన్ని ప్రస్తావించారు. దీనికి మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు సమాధానం చెబుతూ డ్రెయినేజీ నిర్మాణానికి రూ. 25 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపామని, నిధులు మంజూరయ్యాక పనులు నిర్వహిస్తామని చెప్పారు. తిరిగి వలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గాంధీపార్కులో 30 ఏళ్ల నాటి టేకుచెట్టును ఎవరు నరికారని, పార్కుపై అధికారులకు అజమాయిషీ లేదా అని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ మాట్లాడుతూ పార్కులో ఎవరు లేని సమయంలో టేకు చెట్టు నరికివేశారని, ఇది తెలిసిన వెంటనే సంబంధిత చెట్టు కొయ్యలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మున్సిపల్ డీఈఈతో విచారణ నిర్వహించి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. 8వ వార్డు కౌన్సిలర్ కొత్త కుమారి మాట్లాడుతూ పలు పనులకు సంబంధించి సింగిల్ టెండర్లు ఎందుకు ఆమోదించారని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ మాట్లాడుతూ రెండు సార్లు టెండర్లు దాఖలు కాని నేపథ్యంలో మూడోసారి నిబంధనల ప్రకారం సింగిల్ టెండర్లను ఆమోదించామన్నారు. పదో వార్డు కౌన్సిలర్ బేరింగ్ మౌలాలి మాట్లాడుతూ పట్టణంలో అనధికారికంగా ఉన్న కుళాయిలను రెగ్యులరైజ్ చేయాలని ఎన్నిసార్లు కౌన్సిల్ సమావేశాల్లో ప్రస్తావించినా పనులు జరగటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాల్గో వార్డు కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం కలిగించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చెర్మన్ షేక్ రఫాని సభ్యులు ప్రస్తావించిన అన్ని విషయాలపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎజెండాలోని అంశాలను ఆమోదిస్తూ సమావేశాన్ని ముగించారు.

కొండవీడు అభివృద్ధితో పరిసర ప్రాంతాలకు మేలు

గోల్కొండ గ్రూప్‌సంస్థ అధినేత నడికట్టు రామిరెడ్డి

యడ్లపాడు: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడు కోట అభివృద్ధి పట్ల ప్రభుత్వం సుముఖంగా ఉండటం పరిసర ప్రాంతాల ప్రజలకు మేలు కలుగుతుందని గోల్కొండ గ్రూప్ సంస్థ చైర్మన్ నడికట్టు రామిరెడ్డి చెప్పారు. యడ్లపాడు మండలంలోని కొండవీడుకోటను ఆయన శనివారం సందర్శించారు. ఘాట్‌రోడ్డులతో పాటు కొండపై ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక కట్టడాలైన స్వాగతద్వారం, యోగి వేమన మండపం, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, చెరువులు తదితర వాటిని పరిశీలించారు. పర్యాటక రంగంగా గతంలో జరిగిన అభివృద్ధి పనుల్ని తిలకించారు. కొండవీడు అభివృద్ధి పనుల్లో భాగంగా పారిశుద్ధ్యం మెరుగు కోసం తాను బహుకరించిన చెత్త తరలింపు వాహనం వినియోగిస్తున్నారా లేదా అంటూ ఆరా తీశారు. కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కె.శివారెడ్డి చారిత్రక విశేషాలు, అభివృద్ధి పనులు వివరాలను నడికట్టు రామిరెడ్డికి వివరించారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ కొండవీటికోటను అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కూడా ముందుకు రావడం అభినందనీయం అన్నారు. ఈప్రాంతాన్ని రాష్ట్రం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం.విజయ బాలచంద్రరెడ్డి, యన్నం శివారెడ్డి తదితరులు ఉన్నారు.




కొండపై లక్ష్మీనరసింహస్వామి గుడిని పరిశీలిస్తున్న నడికట్టు రామిరెడ్డి

ఆంధ్ర రాష్ట్రంలో ఇదొక్కటే

చారిత్రక అవశేషాల పరిరక్షణ అందరి బాధ్యత అని గోల్కొండ గ్రూప్ సంస్థ అధినేత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. కొండవీడుకోట సందర్శన అనంతరం హౌస్‌గణేష్ పాడులోని కొండవీడు రెడ్డిరాజుల వారసత్వ ప్రదర్శనశాలకు వెళ్లారు. ముందుగా మ్యూజియంలోని చిత్రాలను, ప్రాచీన శిల్పసంపద, శాసనాలను తిలకించారు. అఖిలభారత రెడ్డిసంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఘనంగా కామ్రేడ్ కామేశ్వరరావు వర్ధంతి



నరసరావుపేటటౌన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కామ్రేడ్ ఎస్‌ఏఎస్ కామేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలోని స్వర్గీయ కామేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ జిల్లా ప్రతినిధులు గడ్డం శ్రీనివాసరావు, రవిశంకర్‌లు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఆత్మబలిదానం చేసిన కామేశ్వరరావు సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో ఏఈ సి.హెచ్.రాంభొట్లు, సంఘ నాయకులు ఆర్. బంగారయ్య, మంచాల మౌళి, ఎం. రాజశేఖర్, ప్రసాద్, ఆదిబాబు పాల్గొన్నారు.